కస్తూర్బా పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘనపురం, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని, మోడల్ స్కూల్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గదులను, వంట సామగ్రిని పరిశీలించారు. పాఠశాలల స్పెషలాఫీసర్లు అన్నపూర్ణ, పుష్ప కుమారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు ఏకాగ్రతతో కూడిన విద్యాబోధన అందించాలన్నారు. తద్వార ఉత్తీర్ణత శాతం పెంచి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలువాలని ఆయన కోరారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నద న్నారు. అనంతరం జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌ను పిలిచి మీ పరిధిలోని కస్తూర్బా పాఠశాలలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ నిర్వహించి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలని ఆదేశించారు.

మండల అభివృద్ధికి ప్రణాళిక

లింగాలఘనపురం మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని, అశ్వారావుపల్లి రిజర్వాయరు నుంచి వచ్చే యాసంగిలోపు సాగునీరందిస్తామన్నారు. దేవాదుల పెండింగ్ పనులను నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పదిరోజుల వ్యవధిలో మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, డీఈవో రాము, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, కస్తూర్బా, మోడల్‌స్కూల్ స్పెషలాఫీసర్లు అన్నపూర్ణ, పుష్పకుమారి, నాయకులు పోకల శంకరయ్య, కొల్లూరి నరసింహులు, ఏలె మూర్తి, తాటిపాముల రమేశ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 63 మంది హాజరు

జనగామ చౌరస్తా, జూన్ 15 : జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 63 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్ ఉమారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 10, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ 10 పోస్టుల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహించామన్నారు. 12 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసినట్లు ఉమారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ డివిజన్ మేనేజర్ బీ వినయ్ కుమార్, బ్రాంచి మేనేజర్ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్తయిన పాఠ్యపుస్తకాల పంపిణీ

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 15 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి సంపత్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 478 పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. 2,29,360 పాఠ్య పుస్తకాలకుగాను 2,12,408 పుస్తకాలు పంపిణీ చేశామని ఆయన వివరించారు. 2,02,653 నోట్‌బుక్స్ అందించామని, మొదటి విడుతలో 32,965 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశామని సంపత్ పేర్కొన్నారు. పక్షం రోజుల్లో మరో జత యూనిఫామ్ ఇస్తామన్నారు. స్కూల్ పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌తోపాటు జత యూనిఫామ్ ఇస్తామని వివరించారు.



హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రాము, ఇన్‌చార్జి సంపత్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043. NTW-318953

LEASE/ RENT

★హంటర్ రోడ్, దుర్గాదేవి కాలనీ యందు 1st Floor, 1300 Sft. Open Place Rent (or) లీజుకు ఇవ్వబడును. Cont: 6301853214. NTW-00

HEALTH CARE

★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును. సంప్ర|| 6281476205, 9440325526 KMM_11679

WANTED

jobs Apply Now!

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504. NT-97639

REAL ESTATE

★హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కోదాడ పరిసర ప్రాంతాలలో స్థలాలు, పొలాలు, ప్లాట్స్ అమ్మాలన్నా, కొనాలన్నా & డెవలప్ చేసి ఇవ్వాలన్నా సంప్ర: 9133915599, 7995912999. NT-16

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
JANGAON - 9182777565

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి సహకారం మరువలేనిది
- మండల సభలో ప్రజాప్రతినిధులు

మండల సభలో మాట్లాడుతున్న జడ్పీటీసీ పల్లా భార్గవీరెడ్డి

దేవరుప్పుల, జూన్ 15: బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాయని జడ్పీటీసీ పల్లా భార్గవీరెడ్డి, ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. ఇందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అందించిన సహకారం మరువలేనిదన్నారు. మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ బస్వ సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ, ఎంపీపీ భావోద్వేగానికి గురై ప్రసంగించారు. తాము రాజకీయాలకు కొత్తయినా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎంతగానో సహకారం అందించారని గుర్తు చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలో దేవరుప్పుల మండల అభివృద్ధికి వందల కోట్లు కేటాయించారని తెలిపారు. దీంతో గ్రామాల మధ్య లింక్ రోడ్లు, ఊరూరా సీసీ రోడ్లు నిర్మించామన్నారు. మండలాన్ని కలుపుతూ తారు రోడ్లు. పల్లెప్రగతిలో గ్రామాలను సందరీకరించడంతో దేవరుప్పుల మండలం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని జడ్పీటీసీ పల్లా భార్గవీరెడ్డి, ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. తాము నిత్యం ప్రజల వెన్నంటే ఉండి వారి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించామన్నారు. మంత్రి ఎర్రబెల్లి ప్రోత్సాహంతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకున్నామని, ముఖ్యంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచామని గుర్తు చేశారు. తమ పదవీ కాలం ముగిసినా ప్రజలతోనే మమేకమై ఉంటామని స్పష్టం చేశారు.

ఇసుక అనుమతుల రద్దుకు తీర్మానం

దేవరుప్పుల, రాంభోజీగూడెం, గొల్లపల్లి వాగుల నుంచి చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లకు ఇసుక తరలింపు అనుమతులు రద్దు చేయాలని మండల సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనిపై జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపింది. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వొద్దని, స్థానిక అవసరాలకే కేటాయించాలని సభ్యులు కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

శాఖల వారీగా అధికారుల సమీక్ష

వివిధ శాఖల అధికారులు మండలంలో చేపట్టిన పనులు, ప్రణాళికలను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి సాగర్ మాట్లాడుతూ ఈ వానకాలం సీజన్‌లో మండలంలో సుమారు 33 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారని తెలిపారు. 17 వేల ఎకరాల్లో పత్తి, 16 వేల ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో కంది సాగవుతుందని అంచనా వేసినట్లు వివరించారు. ఇందుకోసం 3,500 మెట్రిక్ టన్నుల యూరియా, 2,800 మెట్రిక్ టన్నుల డీఏపీ, 500 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 200 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ విద్యాసంవత్సరంలోనే 10 పాఠశాలలకు 10 మంది నూతనంగా గెజిటెట్ హెడ్మాస్టర్లను కేటాయించామని మండల నోడల్ అధికారి ఉపేందర్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా ప్రజాప్రతినిధులు వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధిహామీ పథకంలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో తోటలకు పెంచేందుకు ఉద్యానవన శాఖ పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. మండలంలో 50 ఎకరాల్లో నిమ్మ, జామ, సీతాఫలం, మునగ ఇతర పండ్ల తోటల సాగుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఉపాధిహామీ పథకంలో నీటికుంటలు తవ్వడం, మక్కల కొనుగోలు, సంవత్సరం పాటు మెయింటనెన్స్‌కు నిధులు ఇవ్వనున్నట్లు ఏపీఓ శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా చినమడూరులో రూ.10 లక్షల అవినీతి జరిగినా చర్యలు తీసుకోవడంలేదని చినమడూరు ఎంపీటీసీ గొడుగు సుజాత సభ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఏపీవో త్వరలో విచారణ చేపడుతామని హామీ ఇచ్చారు.

రోడ్డున పడ్డ 108 వాహనం..

దేవరుప్పుల మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని ఇన్నాళ్లూ స్థానిక పీహెచ్‌సీలో ఉంచగా ఉద్యోగులు అక్కడ ఉంచేందుకు వీల్లేదని స్పష్టం చేయడంతో సిబ్బంది రోడ్డు పక్కన చెట్టు కింద ఉంటూ సేవలందిస్తున్నారని సభ్యులు తెలిపారు. దీనిపై ఎంపీడీవో లక్ష్మీనారాయణ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాస్, యాకయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, అన్వరున్నీసా బేగం, ఐబీ ఏఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న 'మిషన్ భగీరథ' సర్వే

పాలకుర్తి, జూన్15: 'మిషన్ భగీరథ' అమలుపై మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సర్వే కొనసాగుతున్నది. శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి, వీవోఏలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఇంట్లో నల్లా కనెక్షన్ ఉందా, ఎంత మంది కుటుంబ సభ్యులున్నారు, వారి ఆధార్ కార్డు ఫోన్ నంబర్లు నమోదు చేసుకున్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు 30 నుంచి 50 మంది కుటుంబాల సర్వే నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి తెలిపారు. తాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు మంజుల, శోభ, సునీత పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు స్లాట్ బుక్ చేసుకోవాలి

జనగామ చౌరస్తా, జూన్ 15 : అర్హులైన శారీరక, మానసిక దివ్యాంగులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపునకు హాజరయ్యేందుకు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి మొగులప్ప కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఈ నెల 20, 27, 28 తేదీల్లో ఆర్థో, ఎంఐ, ఎంఆర్, ఓహెచ్, హెచ్ఐ, వీఐ విభాగాల శారీరక, మానసిక దివ్యాంగులకు సదరం క్యాంపులో డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని ఆయన తెలిపారు. అవసరార్థులు సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో మొగులప్ప సూచించారు.

బాల సదనాన్ని తనిఖీ చేసిన జడ్జి

విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సందీప

జనగామ చౌరస్తా, జూన్ 15 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాల సదనం (చిల్డ్రన్స్ హోమ్)ను శనివారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే సందీప తనిఖీ చేశారు. సదనంలో చిన్నారులకు అందిస్తున్న విద్యా, వైద్యంతో పాటు ఇతర వసతులు, అందుతున్న సేవలపై స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి సందీప మాట్లాడుతూ పిల్లలంతా తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ రవీంద్ర, జ్యోత్స్న, బాల సదనం సూపరింటెండెంట్ వరునిక పాల్గొన్నారు.

ప్రేమికుడి మోసంతో ఆందోళన

యువతి ఆత్మహత్యాయత్నం

చిల్పూరు,జూన్ 15 : ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోకుండా మోసం చేయడంతో ఆవేదనకు గురైన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని రాజవరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న పెండ్యాలకు చెందిన చింతల శ్రీలతను రాజవరానికి చెందిన గంగారపు కృష్ణ నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇటీవల కృష్ణ మరో యువతితో పెళ్లి చేసుకునేందుకు యత్నించడంతో శ్రీలత నిలదీసింది. ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని ప్రశ్నించగా కృష్ణ మాయమాటలు చెబుతూ తప్పించుకుంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీలత శనివారం కృష్ణ ఇంటి ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో పారిశుధ్య కార్మికుల ఆందోళన

వేతనాల కోసం ఆందోళన నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 15 : పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు ముందు వేతనాలపై రూ.వెయ్యి అదనంగా పెంచుతామని ఎంపీవో సుధీర్ ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసాక చెల్లిస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. మల్టీ పర్పస్ వర్కర్లకు పెంచిన రూ.వెయ్యితో రెండు నెలల జీతం రావాలన్నారు. 14 మందికి మాజీ సర్పంచ్ రూ.500 పెంచుతామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో డీఎస్ వెంకన్న దృష్టికి తీసుకెళ్లగా వేతనం పెంచే హక్కు తనకు లేదని తెలిపినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు విధులు చేపట్టమని స్పష్టం చేశారు.

సమస్యను డీపీవో దృష్టికి తీసుకెళ్లా : ఆర్డీవో

జీపీ కార్మికుల పెండింగ్ వేతనంతోపాటు, ఎన్నికల ముందు రూ.1000 అదనంగా పెంచుతామని అధికారులు ఇచ్చిన హామీపై డీపీవో దృష్టికి తీసుకెళ్లామని ఆర్డీవో డీఎస్ వెంకన్న తెలిపారు. ప్రజలను దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తించాలని కోరారు.

గోపాల్‌నగర్‌లో మళ్లీ వెలిసిన గుడిసెలు

గుడిసెలు వేసిన ప్రదేశంలో మోహరించిన పోలీసు బలగాలు.

బచ్చన్నపేట, జూన్ 15 : మండలంలోని గోపాల్ నగర్‌లో మళ్లీ గుడిసెలు వెలిశాయి. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 174లోని ఎనిమిది ఎకరాల్లో శనివారం కర్రలు పాతి గుడిసెలు వేశారు. సీపీఎం నాయకులు విజేందర్, బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు నేతృత్వంలో పలు గ్రామాల నుంచి గుడిసెవాసులు తరలి వచ్చారు. విషయం తెలుసుకున్న జనగామ ఏసీపీ అంకిత్‌కుమార్, నర్మెట సీఐ సాయిరమణ, ఎస్సైలు శ్రీకాంత్, శ్వేతతో పాటు భారీగా పోలీసులను మోహరింపచేశారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయడం నేరమని, వెంటనే వాటిని తొలగించాలని పోలీసు అధికారులు తెలిపారు. లేకుంటే చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించినా వారు వినలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, వెంటనే గుడిసెలు ఖాళీ చేయాలని పోలీసులు కోరారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. ఏసీపీ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ ఏ విషయమైనా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాలని చెప్పగా సీపీఎం నేతలు జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యను వివరించారు. ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేసినట్లు నాయకులు తెలిపారు.

వాటర్‌ప్లాంటుకు మరమ్మతు చేయించాలి

జనగామరూరల్, జూన్ 15 : మండలంలోని మరిగడిలో వాటర్‌ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని ప్రత్యేకాధికారి జగన్‌కు గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందించారు. కొద్ది రోజులుగా వాటర్‌ప్లాంట్ నడవకపోవడంతో తాగునీటి సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తాగునీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి వాటర్‌ప్లాంటును మరమ్మతు చేసి, ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో చామకూర చిరంజీవి, కమలాకర్, బాల్నె కుమార్, కర్రె ఆశోక్, పొన్నగంటి మధు, రాజు, వంశీ, ప్రవీణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందింస్తున్న నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గఢ్, జూన్ 15 : మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాజు రవి గత ఏడాది మృతి చెందారు. ఈ నేపథ్యంలో సమితి రాష్ట్ర నాయకులు శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రూ.1,09,725 సాయాన్ని అందించారు. సమితి రాష్ట్ర బాధ్యులు మాట్లాడుతూ రవి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, మాజీ సర్పంచ్ తాటికాయల అశోక్, నాయకులు సోమయ్య, యాదగిరి, కుమార్, జలేందర్, వీరన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ

జఫర్‌గఢ్, జూన్ 15 : మండలంలోని కూనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం దాతలు నోట్‌బుక్స్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన డాక్టర్ అజయ్‌కుమార్, పద్మ దంపతులు రూ.25 వేల విలువైన నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు అందించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించడం ఆనందంగా ఉందన్నారు. నోడల్ అధికారి ఎండీ ఫర్వేజ్ మాట్లాడుతూ ప్రభుత్వ 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ నోట్ బుక్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న వార కల్యాణం

చిల్పూరు, జూన్ 15 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి వార కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని కన్నులపండువగా కొనసాగించారు. మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాలోత్ రాజు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బీమారానికి చెందిన దాత కొత్త సమ్మిరెడ్డిసుజాత దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేశ్, అసిస్టెంట్ వీరన్న, సిబ్బంది కృష్ణ, మల్లికార్జున్, గాదె రాజశేఖర్, మహేశ్, విశాల్, అజేయ్, లక్ష్మి పాల్గొన్నారు.

కుళ్లిన కోడిగుడ్లతో అస్వస్థతకు గురికాలేదు..

జిల్లా సంక్షేమ అధికారి జయంతి

నర్మెట, జూన్ 15 : మండలంలోని మల్కపేట అంగన్‌వాడీ కేంద్రం-2 లో కుళ్లిన కోడిగుడ్లు తిని ఎవరూ అస్వస్థతకు గురికాలేదని జిల్లా సంక్షేమ అధికారి జయంతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్డు తిని చిన్నారి అస్వస్థతకు గురైన విషయమై పత్రికల్లో కథనం రావడంతో ఆమె స్పందించారు. మల్కపేటకు చెందిన అశోక్ కూతురు శ్రీఅద్య అంగన్‌వాడీ సెంటర్-2కు రాదని, ఆమెకు ప్రతి నెలా టీహెచ్‌ఆర్ ద్వారా కోడి గుడ్లు, బాలామృతం ఇస్తారని చెప్పారు. ఈ క్రమంలో మరో 13 మంది పిల్లలకు ఈ నెల 3న, 16న కోడిగుడ్లు ఇచ్చామని, ఎవరూ అస్వస్థతకు గురి కాలేదని ఆమె పేర్కొన్నారు. బాలిక అస్వస్థతకు గురైన విషయమై సోమవారం సీడీపీవో, సూపర్‌వైజర్లు విచారణ చేపట్టినట్లు తెలిపారు. పగిలిన కోడిగుడ్లు, కాలం చెల్లిన కురుకురేలను గుర్తించి కేంద్రం టీచర్ నీరజ, ఆయా లక్ష్మిని మందలించినట్లు జయంతి వెల్లడించారు.

అధిక ఫీజులను విద్యాశాఖ నియంత్రించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత జోగు ప్రకాశ్

జనగామ చౌరస్తా, జూన్ 15 : జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నాయని పేర్కొన్నారు. నర్సరీ నుంచి పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంను సంబంధిత ప్రైవేట్ పాఠశాలల ఆవరణలోనే విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆయా ప్రైవేట్ విద్యా సంస్థల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. నా యకులు బూడిద గోపి, వెంకటేశ్, అబ్రహం లింకన్, వెంకటేశ్, జయ, రజిత, సుధాకర్, స్వామి, పద్మ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌ను క్లియర్ చేయాలి

డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేశ్ బాబు

రికార్డులు పరిశీలిస్తున్న రమేశ్‌బాబు

జనగామ చౌరస్తా, జూన్ 15 : భవన నిర్మాణరంగ కార్మికుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని వరంగల్ డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేశ్ బాబు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కార్మిక శాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఫైళ్లతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం రమేశ్ బాబు మాట్లాడుతూ కార్మిక శాఖ అధికారులు ఓవైపు నోడల్ అధికారులుగా పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విధుల్లో పాల్గొంటూనే మరోవైపు కార్మికుల సంక్షేమానికి సంబంధించిన 3,300 ఫైల్స్‌ను క్లియర్ చేశారని తెలిపారు. జిల్లాలో భవన నిర్మాణ రంగాల కార్మికులకు చెందిన మెటర్నిటీ, మ్యారేజ్, ఇతర బెనిఫిట్స్‌కు సంబంధించిన ఫైల్స్ ప్రస్తుతం 195 పెండింగ్‌లో ఉంటే, అందులో వరంగల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో 106 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మరో 15 రోజుల్లో పెండింగ్ ఫైల్స్ అన్ని క్లియర్ చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో క్లియర్ చేసిన ఫైల్స్ కన్‌స్ట్రక్చన్ బోర్డు హైదరాబాద్ కార్యాలయంలో ఉన్నాయని, మరో 15 రోజుల్లోగా భవన నిర్మాణ రంగాలకు చెందిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో మెటర్నిటీ, మ్యారేజీ, ఇతర నగదు జమవుతుందన్నారు. కార్మికుల ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు కృషి చేస్తున్న జిల్లా లేబర్ ఆఫీసర్ ఆర్ కుమారస్వామితో పాటు సిబ్బందిని రమేశ్‌బాబు అభినందించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, జూన్15: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన శనివారం మండలంలోని మల్లంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కోతి అనిల్ శనివారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స కోసం హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అనిల్‌కు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోశాల వెంకన్న కోరారు.

సంత వేలం నిర్వహిస్తున్న ఏడీఏ వినోద్‌కుమార్

పశువుల విక్రయం, దక్కాకు వేలం

బచ్చన్నపేట, జూన్ 15 : మండల కేంద్రంలో జరిగే వారంతపు సంతలో తై బజార్, దక్కాకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, గ్రామ ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్, ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ సమక్షంలో వేలం కొనసాగించారు. బచ్చన్నపేటకు చెందిన బొడిగం వెంకట్‌రెడ్డి రూ.3.89 లక్షలకు పశువుల అంగడి వేలం, బసిరెడ్డిపల్లికి చెందిన తేలు అంజయ్య రూ.16 వేలకు దక్కా వేలం దక్కించుకున్నారు. తై బజార్‌కు సరైన పాట రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది చక్రధర్, ఆశోక్, మురళి, మల్లేశ్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

నర్మెట, జూన్ 15 : కుటుంబ కలహాలతో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గుంటూరుపల్లిలో జరిగింది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుపల్లికి చెందిన జంజాల బీమయ్య(64)కు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. ఆర్థిక సమస్యలు నెలకొనడంతో బీమయ్య తన కూతురు వివాహం చేయలేకపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన బీమయ్య శుక్రవారం సాయంత్రం గడ్డి మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జనగామలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బీమయ్య మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ హిదాయత్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.